క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్య జోక్యం చేసుకుని పూసపల్లి ఓసీ నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించటమో లేక భూమి బదులుగా ఇవ్వటమో చేసిన తర్వాతే ఓసీ పనులు చేపట్టాలని సూచించినా సింగరేణి అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సింగరేణి ఓసీ అఖిలపక్షం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూనెం సురేందర్, నబీ, క్లింట్ రోచ్, నాగరాజు, చాందావత్ రమేష్

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

పాల్వంచరూరల్: మండలపరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. పాల్వంచ అయ్యప్పనగర్‌కు చెందిన కౌశిక్, ముదల్‌కర్ రూ.5,116, శ్రీనగర్ కాలనీకి చెందిన బుడగం మోహన్ భారవి రూ.10,116 విరాళాలను అందజేసినట్లు ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. ఈ మేరకు దాతలకు శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

సన్మానం

జూలూరుపాడు: జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమితులైన పసుపులేటి వీరబాబును కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వీరబాబుకు కాంగ్రెస్ ఓబీసీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు గోపు రామక్రిష్ణ, రాంశెట్టి రాంబాబు, మల్లెల నాగేశ్వరరావు, పాపిన్ని జనార్దన్, రాంశెట్టి నాగేశ్వరరావు, నరేంధర్, పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్ సరికాదు..

జూలూరుపాడు: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరితే సీపీఎం నాయకులను అక్రమ అరెస్టు చేయడం సరికాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ ఖండించారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం అన్యాయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్, బోడా అభిమిత్ర, మాళోత్ రాములు, ఊడల వెంకటేశ్వర్లు, చందర్‌రావు, బానోత్ మధు ఉన్నారు.

నేడు ఆలయ నిర్మాణాలకు శంకుస్థాపన

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీపాండురంగ భజనమందిరం ఆలయంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి, అమ్మవారి ఉపాలయంల నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆదివారం ఆలయ ఈవో కె.సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ పాండురంగ భజనమందిరం ప్రాంగణంలో వందేళ్ల నుంచి వేంచేసి శ్రీ రామలింగేశ్వరస్వామి, ఇటీవల కాలంలో నిర్మించిన అమ్మవారి ఉపాలయంలు శిథిలావస్థకు చేరినందున దాతల సహకారంతో పూర్వ ఉపాలయాల స్థానాల్లో నూతనంగా నిర్మించుటకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఇల్లెందు: నేడు (సోమవారం) రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లెందు నియోజకవర్గంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియేల్, పులి సైదులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోజంతా పర్యటించనున్న సందర్భంగా మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ మండల కాంగ్రెస్ నేతలు సుదర్శన్ కోరీ, గందె సదానందం, ముక్తి కృష్ణ, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

నివాళి

టేకులపల్లి: టేకులపల్లి మండలం తొమ్మిదోమైలుతండా కోటల్ల గ్రామానికి చెందిన ఐఎఫ్‌టీయూ నాయకుడు ఈసాల ప్రభాకర్ మృతిచెందగా ఆదివారం కోటల్లలో ప్రభాకర్ మృతదేహాన్ని నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఏరియా కార్యదర్శి డి.ప్రసాద్, సంఘం మండల కార్యదర్శి కానుగుల వెంకన్న, నాయకులు మెండు వినోద్, ఊకే ప్రసాద్, ఎర్రయ్య, వెంకన్న, డేగటి క్రాంతి కుమార్, భూక్యా హర్ష్య, గుగులోత్ రామచందర్, కోటల్ల దొర, పటేల్ యదల్లపల్లి రామకృష్ణ, ఈసాల రాజు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ వెలుగులు అంతంతే!

ఐదు కిలోమీటర్లు అంధకారంలోనే..

- కొత్తగూడెం- పాల్వంచ రోడ్డులో మరమ్మతులకు గురవుతున్న లైట్లు

పాల్వంచ: సుజాతనగర్ నుంచి కొత్తగూడెం మీదుగా పాల్వంచ పెద్దమ్మగుడి వరకు బీసీఎం రహదారిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఈ వెలుగులు అన్ని చోట్ల వెలగకపోవడంతో అంధకారం అలముకుంటుంది. కొత్తగూడెం-పాల్వంచ జంట పట్టణాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇక ఇటీవల రెండు మున్సిపాలిటీ కలిసి కార్పొరేషన్ అయ్యాయి. జిల్లా సరిహద్దులో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా వంటి రాష్ట్రాలు ఉండటంతో, భద్రాచలం టెంపుల్ సిటీతో పాటు, అనేక పరిశ్రమలకు నెలవుగా ఉండటంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ క్రమంలో ఈ రోడ్డులో ప్రమాదాలు చోటుచేసుకోవడం పరిపాటి. రాత్రి వేళల్లో ఈ ప్రమాదాలకు మరింతగా ఉంటాయి. ముఖ్యంగా కొత్తగూడెం అడ్డ రోడ్డు నుంచి పాల్వంచ వరకు రోడ్డుపై వాహనాల వేగం అధికంగా ఉంటుంది. ఈక్రమంలో ప్రమాదాలు అత్యధికంగా జరిగేది ఈ ఐదు కిలోమీటర్లలో పరిధిలోనే చోటు చేసుకుంటున్నాయి. అయితే ఈ రోడ్డు గుండా ఉన్న సెంట్రల్ లైటింగ్ అనేక చోట్ల మరమ్మతులకు గురై వెలగడం లేదు. దీంతో రాత్రయితే అంధకారం అలముకుంటుంది. ఇక వర్షాకాలం కావడంతో మరమ్మతులు చేస్తున్నా మళ్లీ సమస్య మొదటికొస్తుందని పలువురు వాపోతున్నారు.

వాహనదారులకు తప్పని తిప్పలు..

సెంట్రల్ లైటింగ్ వెలుగులు అరకొరగా వెలుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కొత్తగూడెం అడ్డ రోడ్డు నుండి పాల్వంచ వరకు అనేక చోట్ల స్తంభాలకు ఉన్న లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇక అధిక స్పీడ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. లైట్ల నిర్వహణ సైతం సరిగా ఉండటం లేదని, మెయింటినెన్స్ సక్రమంగా చేయడం లేదని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సెంట్రల్ లైటింగ్ నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



అలంకారప్రాయంగా ఉన్న సెంట్రల్‌లైటింగ్



అక్కడక్కడ వెలగడం లేదు



కొత్తగూడెం నుండి పాల్వంచ వరకు సుమారు ఏడు కిలోమీటర్లలో చాలా చోట్ల సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రయితే చాలా చోట్ల అంధకారం అలముకుంటుంది. దీంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి.

– జోసెఫ్, స్థానికుడు

ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి



సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడం, వర్షాకాలం కావడంతో రోడ్డులో రాకపోకలు కష్టంగా ఉన్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడంతో పాటు, వెలగని విద్యుత్ స్తంభాలకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలి.

– అబ్దుల్ హమీద్, స్థానికుడు

స్థానిక సంస్థల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్



మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

జూలూరుపాడు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పడమటనర్సాపురం రైతు వేదికలో పాపకొల్లు, అన్నారుపాడు, బేతాళపాడు, కాకర్ల, మాచినేనిపేటతండా, సాయిరాంతండా పంచాయతీలకు చెందిన 175 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అదేవిధంగా పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో జరుగుతుందని, ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయమన్నారు. ఇందిరమ్మ ఇళ్లు రాలేదని బాధపడాల్సిన పనిలేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎలాంటి అవకతవకలకు తావులేదని, ఇళ్లు సకాలంలో పూర్తయ్యేలా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎస్సై బాదావత్ రవి, హౌసింగ్ ఏఈ గాడ్విన్, నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్, లేళ్ల గోపాల్‌రెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, ధరావత్ రాంబాబు, గోపు రామక్రిష్ణ, రాంశెట్టి రాంబాబు, లకావత్ లచ్చు నాయక్, బాదావత్ బాబు, ధర్మరాజుల వెంకటనారాయణ, బానోత్ నవీన్, గుగులోత్ హరి, పుప్పాల నరసింహారావు, గుగులోత్ ప్రియాంక, కిషన్, అచ్చయ్య, నరసింహారావు, బాదావత్ హరీష్, భూక్యా ప్రసాద్, భూక్యా అమృ, చౌడం లక్ష్మీనారాయణ, బానోత్ కిషన్, రఘు, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు ఉన్నారు.

పాల్వంచలో మరో పవర్ ప్లాంట్‌కు కృషి



సాబిర్‌పాషాను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

పాల్వంచ: పాల్వంచలో మరో 800 మెగావాట్ల సామర్థ్యం గల పవర్ ప్లాంట్ కోసం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని, మరో పవర్ ప్లాంట్ సాధిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబిర్ పాషా అన్నారు. ఇటీవల సీపీఐ జిల్లా కార్యదర్శిగా మూడో సారి ఏకగ్రీవంగా సాబీర్ పాషా ఎన్నికైన సందర్భంగా శనివారం సాయంత్రం స్థానిక షాన్‌బాగ్ ఫంక్షన్ హాల్ నందు ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాబిర్ పాషాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఎస్‌ఎ.రహమాన్, ఉపాధ్యక్షులు ఎస్‌కె.ఖాసీం, ఎం.యూసుఫ్, ఖాజామీయా, సయ్యద్ రషీద్, జానీమియా, గౌసుద్దీన్, గౌస్‌పాషా, ఖాజా, అహ్మద్ జానీ, ఇస్మాయిల్, ఖాజామియా, ఖలీలుల్లా, పాషావలి, సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, ముత్యాల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు ముఖాముఖి



ముఖాముఖి నిర్వహిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఆదేశాల మేరకు ఆదివారం ఇల్లెందులోని జీఎం కార్యాలయంలో కారుణ్య నియామకాల కోసం ముఖాముఖి నిర్వహించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు జీఎం కార్యాలయంలో జరిగిన ఎస్‌ఓటూజీఎం రామస్వామి, డీజీఎం పర్సనల్ తుకారం, కేటీసీ ప్రాజెక్టు పీఓ గోవిందరావుల సమక్షంలో ముఖాముఖి నిర్వహించి వివరాలు నమోదు చేశారు. వైద్యపరీక్షల అనంతరం నియామకపత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి అజయ్, అశోక్, క్లర్క్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

గోపాలకృష్ణుడి ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందు : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి ఇల్లెందు పురవీధుల్లో ఆర్య వైశ్య మహాసభ, వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలతో చెలగాటమాడొద్దు..

ఇల్లెందురూరల్: రెక్కలకష్టంతో సింగరేణి సంస్థకు పురుడుపోసిన నాటి కార్మికుల కుటుంబాల భవిష్యత్‌తో చెలగాటమాడొద్దని 21 పిట్ ఏరియా అఖిలపక్ష కమిటీ స్పష్టం చేసింది. మండలంలోని తిలక్‌నగర్ ఫంక్షన్‌హాల్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. బొగ్గు తవ్వకాల ప్రారంభంలో గని ప్రమాదాలకు భయపడి పనులకు ఎవరూ రాకపోవడంతో వారి పూర్వీకులతో పనులు చేయించారని, నాడు అధికారులే సహకరించి 21 పిట్ ఏరియాలో వారి పూర్వీకులతో గుడిసెలు వేయించారన్నారు. ఆ నిర్మాణాల్లో నేటికీ వారి వారసులు జీవనం సాగిస్తున్నారంటే ప్రాంతం లీజు భూములంటూ ఖాళీ చేయించే కుట్రకు సింగరేణి తెరలేపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వందేళ్ల లీజు 2016లోనే పూర్తయిందని, రెన్యూవల్ సమయంలో నివాస గృహాలను, సాగు భూములను రెవెన్యూ అధికారులు సింగరేణికి ఎలా లీజుకు ఇస్తారని ప్రశ్నించారు. జేకే ఓసీ విస్తరణ వల్ల నిర్వాసితులు అవుతున్న ప్రజలకు పరిహారం చెల్లించి, క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారికి వాటిని ఉచితంగా అప్పగించే వరకు జేకే ఓసీ విస్తరణ పనులను ముందుకు సాగనివ్వమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు పూనెం సురేందర్, అబ్దుల్ నబి, సత్యనారాయణ, తాండ్ర నాగరాజు, ధనసరి రాజు, ఎట్టి హరికృష్ణ, శ్రీనివాస్, క్లింట్‌రోచ్, చందావత్ రమేష్, లాలు, సదరం మహేష్, మొగిలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకేఓసీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ సీఆర్‌క్లబ్‌లో జరిగిన జేఏసీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. మూడేళ్ల తరువాత ఏరియాలో ప్రారంభంకానున్న వీకేఓసీలో స్థానికులకు అవకాశం కల్పించి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్మికులను దృష్టిలో పెట్టుకొని సోదా కంపెనీ మొదట స్థానికులనే ఉద్యోగాల్లో తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్షల్ జెట్టి మోహన్, ఎస్.సంజీవ్, భుక్య రమేష్, రవి గౌడ్, మోహన్, ఆంజనేయులు, రఘు, యాకయ్య, బాచి, హైట్ శివ, అహ్మద్, శివ శంకర్, కలకోట రాజు, గుండా శ్రీను, కరుణాకర్, నాగరాజు, సాంబశివరావు పాల్గొన్నారు.

అమాత్యా.. ఎన్నేళ్లు ఇలా..?

- చట్టాలున్నా చుట్టపు చూపుగానే..
- కాగితాలు దాటని హక్కులు
- దుర్భరంగా మారుతున్న ఏజెన్సీలో జీవనం



ఎనిమిదేళ్లుగా అప్‌గ్రేడ్‌కు నోచుకోని మాణిక్యారం యూపీఎస్ పాఠశాల

ఇల్లెందురూరల్: ఏజెన్సీ చట్టాలు.. రాజ్యాంగ హక్కులు.. ఏవీ వారికి ఊరటనివ్వలేకపోతున్నాయి. వాటిని అమలు చేయాల్సిన అధికారులు దిక్కులు చూడటం మినహా ఆదుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు. ఫలితంగా దశాబ్దాలుగా ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలను దరిచేర్చుకోలేక.. ఉపాధి కోసం కూలీలుగానే జీవనం సాగించడం మినహా మరో గత్యంతరం లేని దుర్భర స్థితిలో ఇల్లెందు ఏజెన్సీలోని పలు గ్రామాలలో గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. సోమవారం మండలంలో పర్యటిస్తున్న రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమ సమస్యలను ఆలకించి పరిష్కారం చూపాలని ఏజెన్సీ వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

40 ఏళ్లుగా అపరిష్కృతంగానే..

మండలంలోని మామిడిగుండాల, ధనియాలపాడు పంచాయతీల పరిధిలో 40 ఏళ్లుగా సీలింగ్ భూముల సరిహద్దు వివాదం కొనసాగుతూనే ఉంది. 1990కి ముందే నాటి రెవెన్యూ అధికారులు స్థానిక గిరిజన రైతులకు సీలింగ్ పట్టాలిచ్చి సరిహద్దులు పేర్కొనకపోవడంతో ఎవరి భూమి ఎక్కడుందో నేటికీ ప్రశ్నార్థకంగా ఉండిపోయింది. సదరు రైతులు ప్రభుత్వం అందించే రైతుభరోసాకు, రైతు బీమాకు నోచుకోవడం లేదు. సీలింగ్ భూముల సరిహద్దు వివాదం ఎప్పుడు పరిష్కరిస్తారో.. కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని రైతులు నాలుగు దశాబ్దాలుగా ఆశగా ఎదురు చూస్తున్నారు.

అవసరం కోసం అక్కున చేర్చుకొని..

ప్రమాదాల గనులుగా పేరొందిన సింగరేణి బొగ్గు బావుల్లో వందేళ్ల క్రితం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని శ్రమించి పని చేసిన కూలీలు సంస్థను నిలబెట్టారు. వందేళ్లుగా వారి పూర్వీకులు నిర్మించిన ఆవాసాలలో వారి వారసులు అసౌకర్యాల నడుమనే జీవనం సాగించారు. నాటి నుంచి 21 పిట్ ఏరియాలో నివాసం ఉంటున్న వారిని ప్రస్తుతం జేకే ఓసీ విస్తరణ పేరుతో ఖాళీ చేయించే ప్రయత్నం జరుగుతోంది. వారి భూములకు సంబంధించి గతంలో పట్టాలకు దరఖాస్తు చేసుకుంటే తమ పరిధిలో భూమి కాదని నాడు రెవెన్యూ అధికారులు దరఖాస్తులను తిరస్కరించి నేడు ఆయా భూములను సింగరేణికి లీజుకిచ్చామని జారీ చేయడం వారిని కుంగదీస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆమోదం తెలిపారు. తీరా పనులు ప్రారంభించుకునే వేళ అవి సింగరేణి లీజు భూములంటూ అడ్డుకునే ప్రయత్నం జరుగుతోంది. ఇలా పలువురు పునాది దశలోనే ఇంటి నిర్మాణాలను నిలిపివేశారు. ఇటీవల ఎమ్మెల్యే కోరం కనకయ్య సైతం ఇదే సమస్యను సింగరేణి డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఏజెన్సీ చేదయ్యిందేమో..

మండలంలో వ్యవసాయ ఆధారితం కాగా కానీ వంద ఎకరాలకు సాగునీటి అందించే స్థాయిలో ఒక్క చెరువు లేదు. మండలం మొత్తం జల్లెడ పట్టినా కనిపించేది ఒకే ఒక్క చెక్‌డ్యాం మాత్రమే. ఇక విద్యా, ఉపాధి అవకాశాలు ఇల్లెందు పట్టణం చుట్టూరా అల్లుకుపోవడం ఏజెన్సీ విద్యార్థులు, యువతకు ఇబ్బందిగా మారిపోయింది. రెండు పీహెచ్‌సీలు ఏర్పాటు చేసినా అక్కడ ఆధునిక సౌకర్యాలు అంతంత మాత్రమే. అత్యవసరం అయితే ఇల్లెందు, ఖమ్మం, కొత్తగూడెం వంటి పట్టణాలకు పరుగులు తీయక తప్పని పరిస్థితి. వందల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేస్తున్నా కనీస ప్రోత్సాహం రైతుల దరి చేరడం లేదు. శీతల గిడ్డంగి నిర్మాణం ఏళ్ల ప్రకటనలకే పరిమితం కావడం ఏజెన్సీ రైతులకు శాపంగా మిగిలిపోయింది.

‘శ్రావణ’బోనమెత్తిన పల్లె

శ్రావణమాసం సందర్భంగా ఆదివారం గ్రామాల్లో బోనాల వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు నెత్తినపెట్టుకుని మేళతాళాలు, డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామదేవతలు, ముత్యాలమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. వేటపోతులు, కోళ్లు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా పలు గ్రామాల్లో ప్రజలు వనభోజనాలకు తరలివెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని వనదేవతలకు పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: కరివారిగూడెంలో నాభిశిలకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు



ఇల్లెందురూరల్: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



శివసత్తుల నృత్యాలు..



పాల్వంచ: రజక వీధిలో..



పాల్వంచరూరల్: సీతానగర్‌కాలనీలో..

ప్రాణాలుపోతేనే పట్టించుకుంటారా..

- ప్రమాదభరితంగా ఎన్‌హెచ్ 930పీ రహదారి



ప్రమాదకరంగా మారిన గుంత

టేకులపల్లి: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు, వాహనదారులకు శాపంగా మారింది. ఎన్‌హెచ్ అధికారుల పట్టింపు శూన్యం కారణంగా ఎన్‌హెచ్930పీ రహదారి ప్రమాదభరితంగా మారింది. మరమ్మతులు చేయించాల్సిన అధికారుల నిర్లక్ష్యం, కెపాసిటీకి మించి వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో ఇల్లెందు నుంచి కొత్తగూడెం క్రాస్‌రోడ్ వరకు ప్రధానంగా టేకులపల్లి నుంచి బొమ్మనపల్లి వరకు గుంటలు ప్రమాదభరితంగా మారాయి. టేకులపల్లి సెంటర్‌లో ఏర్పడిన గుంత మాత్రం యమలోకానికి దారిలాగే ఉంది. వానాకాలం మరీ దారుణంగా ఈ గుంతలో నీరు నిండి ఉండటంతో కేవలం వరద నీరే కదా అని వాహనదారులు నీటిలో నుండే వెళ్తుండటం బైక్‌లు, ఆటోలు, కార్లు ఈ గుంతలో పడి ఇరుక్కుపోవడమే కాకుండా వాటి భాగాలు పాడవుతున్నాయి. మరో వైపు అదుపు తప్పి కింద పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది పడి గాయాలపాలైన ఘటనలున్నాయి. రోడ్డు మరమ్మతుల కోసం ప్రతి సంవత్సరం రూ.కోటి కేటాయిస్తున్నప్పటికీ ఆ నిధులు ఏమవుతున్నాయో.. మరమ్మతులు ఎప్పుడు, ఎక్కడ చేస్తున్నారో అధికారులకే తెలియాలి. ప్రాణ నష్టం జరగకముందే అధికారులు మేల్కొని తక్షణమే ప్రధాన రహదారిలో మరమ్మతులు చేపట్టాలని, ప్రధానంగా టేకులపల్లి సెంటర్‌లో గుంతకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

వంతెనలు... బీటీ రోడ్లకు మోక్షం

- సాక్షి కథనాలకు స్పందన..



తావుర్యాతండా - పాత తడికలపూడి రోడ్డు

టేకులపల్లి: దశాబ్దాలుగా టేకులపల్లి మారుమూల ఏజెన్సీ ప్రజలు వంతెనలు, బీటీ రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేస్తూ వంతెనలు, బీటీ రోడ్ల ఆవశ్యకతపై సాక్షిలో ప్రచురితమైన ప్రత్యేక వార్తా కథనాలతో అధికారులు స్పందించడంతో సంబంధిత పనుల కోసం డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరయ్యాయి. మంజూరైన వంతెనలు, బీటీ రోడ్ల నిర్మాణాలకు సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారు. మండలంలో పొంగులేటి పర్యటించి శంకుస్థాపనలు చేస్తారని పీఆర్ ఏఈ నవీన్ తెలిపారు.